## మోడల్ పాఠశాలలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో చేరేందుకు 2025-26 విద్యాసంవత్సరానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అంతుల్‌బారి బుధవారం తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు ఫిబ్రవరి 28వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13న ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.




# ఖరారైన.. మండలి పోరు

**ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల కమిషన్**

- వచ్చేనెల 3న నోటిఫికేషన్
- ఫిబ్రవరి 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, పీఆర్‌టీయూ
- ఇంకా నిర్ణయం తీసుకోని కాంగ్రెస్, బీఆర్ఎస్
- టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్న నేతలు, విద్యాసంస్థల యజమానులు
- షెడ్యూల్ రావడంతో ప్రచారం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్న అభ్యర్థులు
- ప్రతీ ఎన్నికల్లో భిన్నమైన తీర్పును ఇస్తున్న గ్రాడ్యుయేట్లు

నిజామాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీకి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌లో ప్రకటించింది. మార్చి3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ ఎన్నికల కోసం ఇప్పటికే బీజేపీ అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలు అభ్యర్థులను ప్రకటించలేదు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ఎక్కువ మంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఆశావహులు నామినేషన్‌లతో పాటు ప్రచారం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల పోలింగ్‌కు నెల రోజులే సమయం ఉండటంతో నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో సుడిగాలి పర్యటనలు చేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. గ్రాడ్యుయేట్‌లతో పాటు టీచర్ల మద్దతును కూడగట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు.

### మార్చి29తో ముగియనున్న పదవీ కాలం

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. ఆలోపు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ బుధవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. నెలరోజులలోపు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొంది. ఈ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంతో పాటు టీచర్స్ నియోజకవర్గం ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, రఘోత్తమ్‌రెడ్డిల పదవీకాలం పూర్తవుతుండటంతో ఎన్నికల కమిషన్ ఈ ప్రకటన చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆ రోజు నుంచి ఫిబ్రవరి 10 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 11న నామినేషన్లను పరిశీలిస్తారు. 13 వరకు నామినేషన్లను విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. అదేరోజు పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ ఎన్నికల పోలింగ్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత మార్చి 3న ఎన్నికల కౌంటింగ్ చేపట్టనున్నట్లు ప్రకటించారు. అదేరోజు ఫలితాలను వెల్లడించనున్నారు.

### ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

ఈ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ పూర్తి స్థాయిలో కసరత్తు చేసింది. గత ఆరు నెలల నుంచే ఓటరు లిస్ట్ తయారీతో పాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపు చేపట్టింది. ఎన్నికలకు కావాల్సిన అన్నిరకాల మౌలిక వసతులను కల్పించాలని నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం జిల్లాలో మొత్తం 33 మండలా ల్లో 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 21, బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 11, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం మొత్తం 30వేల 593 మంది ఓటర్లు ఉన్న ట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. టీచర్ ఎమ్మెల్సీ కోసం జిల్లాలోని 33 మండలాల పరిధిలో 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. టీచర్ ఎ ఎ ్మ ల్సీ ఎన్నికల్లో మొత్తం 3,529 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ముందే ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు ఎన్ని కల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టనున్నారు.

> **ఇంకా నిర్ణయం ప్రకటించని బీఆర్ఎస్**
>
> గ్రాడ్యుయేట్‌తో పాటు టీచర్ ఎమ్మెల్సీ పోటీపై బీఆర్ఎస్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. టీచర్ ఎమ్మెల్సీలో పోటీలేకున్నా.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోటీకోసం చాలా మంది నేతలు సంవత్సరం కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి కరీంనగర్‌లో వైద్యుడిగా సేవలందిస్తున్న బీఎన్ రావు బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయ త్నాలను కొనసాగిస్తున్నారు. ఉస్మానియా జేఏసీలో పనిచేసి తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన రాజారాం యాదవ్ కూడా బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ఆయన విద్యార్థి సంఘాలతో పాటు ఇతర సంఘాలను కలుస్తూ మద్దతు ను కూడగడుతున్నారు. ఆయనతో పాటు కరీంనగర్ మేయర్‌గా పనిచేసిన సర్దార్ రవీందర్ సింగ్ కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఆరు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

### అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీజేపీ ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ తరపున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం అభ్యర్థిగా అంజిరెడ్డిని, టీచర్ ఎమ్మెల్సీ కోసం మల్క కొమురయ్యను ప్రకటించింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి అంజిరెడ్డికి అవకాశం ఇవ్వగా.. టీచర్ ఎమ్మెల్సీ కోసం కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి మల్క కొమురయ్యకు అవకాశం ఇచ్చింది. ఈ ఇద్దరు అభ్యర్థులు ఈ ఎన్నికల కోసం సమావేశాలను నిర్వహిస్తున్నారు. పార్టీ నేతలను కలుస్తూ సహకరించాలని కోరుతున్నారు. పీఆర్‌టీయూ తరఫున గంగా మహేందర్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. మిగతా టీచర్ యూనియన్‌ల నుంచి కూడా పోటీ చేసేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల సంస్థ ట్రస్మా నుంచి యాదగిరి శేఖర్‌రావు పోటీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన ప్రైవేటు పాఠశాలల సంఘాలను ఇప్పటికే పలు దఫాలు కలిశారు. పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రైవేటు సంస్థల తరఫున సహకరించాలని ఆయన కోరుతున్నారు. బీఆర్ఎస్ నుంచి ప్రయత్నాలు చేసిన ఆయన ప్రస్తుతం అవకాశం వచ్చిన రాకున్నా స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. బడ్జెట్ పాఠశాలల తరఫున జగ్గు మల్లారెడ్డి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు.

### అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్

అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించలేదు. టీచర్ అభ్యర్థికి మద్దతు ఇస్తామని తెలిపినా.. ఇంకా పూర్తి స్థాయిలో ప్రకటన చేయలేదు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి ప్రస్తుతం టి.జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన సీనియర్ నేత కావడంతో పాటు రెండు దఫాలు మంత్రిగా పనిచేశారు. ఐదు దఫాలు ఎమ్మెల్యేగా కొనసాగారు. కాంగ్రెస్‌లో సీనియర్‌గా ఉన్న ఆయన ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీలో నేతలను కలుస్తూ తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. జీవన్‌రెడ్డికి అవకాశం దక్కకుంటే తనకు అవకాశం ఇవ్వాలని తెలంగాణకు చెందిన ఆల్ఫోర్స్ సంస్థల యాజమాన్యం నరేందర్‌రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ నేతలను కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఆరు నెలలుగా ఆయన పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఓటరు నమోదు చేయించడంతో పాటు ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో పర్యటనలు చేస్తూ గ్రాడ్యుయేట్‌ల మద్దతును కూడగడుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల మంత్రుల సహకారంతో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ టికెట్ కోసం డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా పనిచేసిన ప్రసన్న హరికృష్ణ, డీఎస్పీగా పనిచేసి వలంటరీ రిటైర్డ్‌మెంట్ తీసుకున్న గంగాధర్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు.

> **పోటీకి స్వతంత్రుల ఆసక్తి**
>
> ఎన్నికల్లో పోటీ చేసేందుకు స్వతంత్రులుగా ఎక్కువ మంది సిద్ధమవుతున్నారు. వివిధ రంగాల్లో పనిచేసిన వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. లెక్చరర్‌గా పనిచేసిన ధర్మారంకు చెందిన విద్యాసాగర్ కూడా పోటీకి ప్రయత్నాలు చేస్తున్నారు. అవకాశం వస్తే కాంగ్రెస్ నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. అవకాశం రాకుంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. వీరే కాకుండా మరికొంత మంది పోటీకి సిద్ధమవుతున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించినందున అనేక మంది ప్రయత్నాలు కొనసాగించడంతో పాటు పోటీ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

> **గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ప్రతీసారి భిన్నమైన ఫలితాలు**
>
> గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ప్రతీసారి భిన్నమైన ఫలితాలు వస్తున్నాయి. గాడ్యుయేట్‌లు ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం లేదు. ఉమ్మడి రాష్ట్రం హయాంలో ఈ నియోజకవర్గం నుంచి రెండు దఫాలు బీఆర్ఎస్ నేత నాగదాస్ లక్ష్మణ్ రావును గెలిపించారు. తదుపరి ఎన్ని కల్లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించారు. అధికారంలో బీఆర్ఎస్ ఉన్న తమ అభ్యర్థిని ఈ ఎన్నికల్లో నిలుపలేదు. ఈ దఫా కాంగ్రెస్ అధికారంలో ఉండి రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం ఉద్యోగాల భర్తీ చేపడుతోంది.



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

## ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో ఎమ్మెల్యే ధన్‌పాల్ పుణ్యస్నానాలు

- త్రివేణి సంగమంలో కుటుంబ సమేతంగా స్నానం ఆచరించిన అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం మౌని అమావాస్య సందర్భంగా ప్రయాగరాజ్‌లోని గంగ యమున సరస్వతీ నదుల పవిత్ర కలయిక అయిన త్రివేణి సంగమంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే కుంభమేళా అన్నిటికంటే పవిత్రమైందన్నారు. సాధుసన్యాసుల కలయిక ఈ మహా కుంభమేళా అని అన్నారు. ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో స్నానం ఆచరించడం వల్ల పాపాలు తొలగిపోయి పుణ్యం, మోక్షం లభిస్తుందన్నారు. ఈ కుంభమేళాకు దేశ నలుమూలల నుంచి కాకుండా విదేశాల నుంచి భక్తులు కోట్ల సంఖ్యలో రావడం ప్రపంచ వ్యాప్తంగా సనాతన హిందూధర్మాన్ని ప్రతిబింబించేలా ఉందన్నారు. సామాన్య భక్తులకు సైతం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తున్నందుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి తెలంగాణ భక్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు.



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

## పనితీరులో మార్పు కనిపించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

వర్ని, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాల పనితీరులో గణనీయమైన మార్పు కనిపించేలా అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, పాత వర్నిలో ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. సీహెచ్‌సీలోని లేబోరేటరీ రూమ్, ఇన్ పేషెంట్ వార్డ్, హెల్ప్ డెస్క్, వ్యాక్సినేషన్ రూమ్ తదితర వాటిని పరిశీలించారు. అన్ని రకాల మందులు ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నారా? సరిపడా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా? తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటిస్తూ, మెరుగైన సేవలందించాలన్నారు.

### గురుకుల పాఠశాల తనిఖీ

పాత వర్ని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, జ్యోతిబాపూలే గురుకులాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సందర్శించారు. స్టోర్ రూమ్, కిచెన్‌లను తనిఖీ చేసి బియ్యం, కూరగాయలు, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరును కలెక్టర్ పరిశీలించారు. ఐదవ తరగతి విద్యార్థినులతో ఆంగ్లం సబ్జెక్టులోని పాఠాలు చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత స్థానాలలో రాణించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. కాగా, ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని ప్రధానోపాధ్యాయుడు కలెక్టర్ దృష్టికి తేగా అదనపు తరగతి గదులను మంజూరు చేస్తామని అన్నారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని 106సర్వే నెంబర్‌లో ఉన్న 7ఎకరాల 35గుంటల భూమిని క్రీడాప్రాంగణానికి కేటాయించడంపై కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. పాత కలెక్టరేట్ మైదానం వద్ద స్థలాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా ఉపయోగంలోకి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఛైర్మన్ లింగన్న, ఉపాధ్యక్షుడు భక్తవత్సలం, వాసు, సంజీవ్‌రెడ్డి, మీసాల సుధాకర్, తదితరులు ఉన్నారు.

## 1వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి డెంటల్ కాన్ఫరెన్స్

**బర్ధిపూర్ బృందావన్ గార్డెన్‌లో మూడు రోజుల పాటు సమావేశాలు**

డిచ్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్ధిపూర్ బృందా వన్ గార్డెన్‌లో వచ్చేనెల 1తేదీ నుంచి మూడు రోజులపాటు తెలంగాణ రాష్ట్ర 9వ డెంటల్ కాన్ఫరెన్స్ సమావేశాలు నిర్వహించనున్నామని కాన్ఫరెన్స్ ఛైర్మన్ డాక్టర్ నందకుమార్, ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. డెంటల్ రంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన చికిత్సలపై ఈ కాన్ఫరెన్స్‌లో చర్చించనున్నామని వారు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆధోని ఎమ్మెల్యే డాక్టర్ ప్రశాంతి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కె.రాజేష్‌రెడ్డి, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ బి.ప్రమోద్‌కుమార్, డాక్టర్ విక్రమ్‌రెడ్డితో పాటు రాష్ట్రంలోని డెంటల్ వైద్యులు హాజరుకానున్నారని తెలిపారు.

## ఎత్తొండ విండో పాలకవర్గానికి అధికారుల నోటీసులు

**విండో కార్యదర్శి పాటు మరో ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు**

కోటగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండ ప్రాథమిక సహకార సంఘ పాలకవర్గానికి జిల్లా సహకార శాఖ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. అలాగే విండో కార్యదర్శి సంతోష్‌తో పాటు మరో ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ డీసీవో శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. సహకార సంఘంలో జరిగిన లావాదేవీలపై ఆడిట్ అధికారులు ఇటీవల విచారణ జరిపారు. ఈ విచారణలో సంఘం 8,80,58,873 రూపాయలు నష్టపోయినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఇందుకు సంఘం మాజీ ఛైర్మన్ అశోక్ పటేల్‌తో పాటు విండో కార్యదర్శి సంతోష్, మరో ఐదుగురు సిబ్బందిని అధికారులు బాధ్యులుగా చేశారు. ఈ విషయమై స్పందించిన జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రావు.. పాలకవర్గాన్ని ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేశారు. అలాగే విండో కార్యదర్శితో పాటు మరో ఐదుగురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత పాలకవర్గం పదిహేను రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


**ఉద్యోగ అవకాశములు**



ప్రముఖ దినపత్రిక ఆంధ్రజ్యోతి లో అడ్వర్టయిజ్ డిపార్ట్‌మెంట్ నందు Ad. Rep గా పనిచేయుటకు పత్రికా రంగములో అనుభవము ఉన్న యువకులకు ప్రాధాన్యత కలదు. సమర్థులైన కొత్తవారికి కూడ అవకాశము కలదు.

విద్యార్హత : ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ

పనిచేయాల్సిన కేంద్రం
కామారెడ్డి

అనుభవము, అర్హతను బట్టి జీతము.

ఇంటర్వ్యూ తేది: 30-01-2025
సమయం: 10AM to 1PM

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయం
గొల్లపల్లి రోడ్, ధర్మారం (బి), మం. డిచ్‌పల్లి, జిల్లా నిజామాబాద్
అసిస్టెంట్ మేనేజర్ 99854 11453


# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై

- కారు విక్రయం విషయంలో లంచం డిమాండ్
- నగరంలో ఏసీబీకి పట్టుబడిన కామారెడ్డి జిల్లా లింగంపేట్ ఎస్సై సుధాకర్



ఏసీబీకి పట్టుబడిన కామారెడ్డి జిల్లా లింగంపేట్ ఎస్సై

ఖిల్లా, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా లింగంపేట్ ఎస్సై కండి సుధాకర్ బుధవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ నగరానికి చెందిన 'కార్‌బజార్' యజమాని తులసివెంకట నర్సింహులు అలియాస్ (స్వామి)పై కారు విషయంలో కేసు నమోదు చేయకుండా ఉండేందుకు కామారెడ్డి జిల్లా లింగంపేట్ ఎస్సై సుధాకర్ రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో తాను అంత ఇవ్వలేనని.. రూ.12,500 ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుని రెండు రోజులు సమయం తీసుకున్నాడు. అయితే ఎస్సైకి లంచం ఇవ్వడం ఇష్టంలేని స్వామి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు.. నగరంలోని వినాయక్‌నగర్ చౌరస్తా వద్ద గల రుక్మిణి చాంబర్ సమీపంలో లింగంపేట ఎస్సై సుధాకర్ నగదు తీసుకుంటుండగా పట్టుకున్నారు. అనంతరం ఆయనను నగరంలోని నాల్గో టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లింగంపేట ఎస్సైపై 188/2024, సెక్షన్ 420,506 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేసి ఆయనను మొదటి అదనపు స్పెషల్ జడ్జి నాంపల్లి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు అధికారులు తెలిపారు.



బాధితుడు స్వామి

### బాధితుడి కథనం ప్రకారం ఇలా..

కామారెడ్డి జిల్లా లింగంపేట్‌కు చెందిన కొండేష్‌కు చెందిన కారును లింగంపేట్‌కు చెందిన నవీన్ అనే వ్యక్తి ద్వారా నిజామాబాద్ నగరానికి చెందిన కార్‌బజార్ యజమాని స్వామికి 2022లో విక్రయించాడు. ఆ కారును తిరిగి స్వామి నగరంలోని నాగారంకు చెందిన చిరంజీవికి అమ్మి ఆ కారుపై ఉన్న వాయిదాలను చెల్లించుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. కాగా, చిరంజీవి కారుపై ఉన్న వాయిదాలను చెల్లించకపోవడంతో బ్యాంకర్లు నోటీసులు జారీ చేశారు. దీంతో అసలు కారు యజమాని కొండేష్ లింగంపేట్ పోలీసు స్టేషన్‌లో స్వామిపై ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు లింగంపేట్ ఎస్సై.. 'కార్‌బజార్' యజమాని స్వామిని కారుతో స్టేషన్‌కు రావాలని సూచించారు. దీంతో రెండు రోజుల క్రితం కారును తీసుకుని స్వామి స్టేషన్‌కు వెళ్లగా కేసు నమోదు చేస్తానని ఎస్సై హెచ్చరించి స్వామి సెల్‌ఫోన్ తీసుకుని ఆ రోజంతా స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. తన తప్పు లేకున్నా తనను అనవసరంగా స్టేషన్‌లో రోజంతా ఉంచినందుకు స్వామి మనస్తాపం చెందాడు. డబ్బులు చెల్లించడం ఇష్టం లేక ఎస్సైపై ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏసీబీ అధికారులు ఎస్సైని నగరంలోని వినాయక్‌నగర్‌లో లంచం తీసుకుంటుండగా పట్టుకుని ఎస్సైపై కేసు నమోదు చేశారు.

## జిల్లాలో ముగ్గురు తహసీల్దార్ల బదిలీ

నిజామాబాద్అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. వచ్చేనెల 3న శాసనమండలి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండడంతో ముందస్తుగా ముగ్గురు తహసీల్దార్లను బదిలీ చేసినట్లు తెలుస్తోంది.ఆర్మూర్ తహసీల్దార్‌గా పని చేస్తున్న గజానంద్‌ను ముప్కాల్‌కు బదిలీ చేయగా మోర్తాడ్‌లో పని చేస్తున్న సత్యనారాయణను ఆర్మూర్‌కు బదిలీ చేశారు. ముప్కాల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కృష్ణను మోర్తాడ్‌కు బదిలీచేసినట్లు సమాచారం.

## సమగ్ర శిక్షా ఉద్యోగుల క్యాలెండర్ల ఆవిష్కరణ

నవీపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నిజామాబాద్ జిల్లా 2025సంవత్సరానికి సంబంధించి క్యాలెండర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో సంబంధిత క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, మోకన్‌పల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారిణి కవిత, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు రాకేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మి నారాయణ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఐఎస్‌లు, సీఆర్పీలు, ఐఈఆర్పీలు, మెసెంజర్లు పాల్గొన్నారు.

## బాధితులకు ఐదు సెల్‌ఫోన్‌ల అందజేత

ఆర్మూర్‌టౌన్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఐదుగురు బాధితులకు బుధవారం ఐదు సెల్‌ఫోన్‌లను ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ అందజేశారు. గతంలో బాధితులైన ఆదర్శ్, సురేష్, ఏడుకొండలు, ఆనంద్, సాయికృష్ణలు సెల్‌ఫోన్‌లను పోగొట్టుకోవడంతో వారి ఫిర్యాదుమేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి ఐదుగురు బాధితులకు వారి సెల్‌ఫోన్‌లను అప్పగించారు.

## నలుగురు పీఎంపీ వైద్యులపై కేసు

డిచ్‌పల్లి,జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తూ పేద ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న మందులు విక్రయిస్తూ సొంత వైద్యం కొనసాగిస్తున్న నలుగురు పీఎంపీ వైద్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఈవ్యవహారంపై విజిలెన్స్ వైద్యాధికారి స్వయంగా ఆస్పత్రిలను తనిఖీ చేయగా వ్యవహారం బయటపడిందని ఉన్నత అధికారుల ఫిర్యాదు మేరకు తాము కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రాజేశ్వర్ (మానస హాస్పిటల్), వెంకటేశ్వర్(మణికంఠ ఫస్ట్ ఎయిడ్ సెంటర్), దత్తాద్రి (ప్రశాంత్ క్లినిక్),గోలీసందీప్(లక్ష్మీనర్సింహ) క్లినిక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఒక ప్రకటనలో తెలిపారు.

## పని ఒత్తిడి భరించలేక
## ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఆత్మహత్య

ధర్పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని విధులు నిర్వహిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ (మిషన్ భగీరథ) సాయి చరణ్ (25) పని ఒత్తిడి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం 10 గంటలకు సాయిచరణ్ పనికి వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి వెళ్లాడు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడిపెల్లి గ్రామశివారులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. సాయిచరణ్‌ను బుధవారం ఉదయం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సాయిచరణ్ తుది శ్వాస విడిచాడు. మృతుడు పనిఒత్తిడి వల్ల మానసికంగా కుంగిపోయి పురుగుల మందు తాగినట్టు తెలిసింది. మృతుడి అక్క హారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. సాయిచరణ్ విధుల్లో చేరి మూడు నెలలు కావస్తోంది. ఉద్యోగంలో పనిఒత్తిడి కారణంగా మానసికంగా బాధపడే వాడని మృతుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పలు ఆలయాల్లో ఘనంగా జాతర


రామన్నపేట్ అయ్యలగుట్ట రాజరాజేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వేల్పూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ గ్రామసమీపంలో రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అయ్యల జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తుల కోసం అన్నివిధాల సౌకర్యాలు వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఉదయం రాజరాజేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు పెద్దఎత్తున బారులు తీరిప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.. అంతకుముందు రాజరాజేశ్వరస్వామికి వేదపండితులు అభిషేకం, అలంకరణ, యజ్ఞం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**● రామన్నపేట్‌లో అయ్యలగుట్ట వద్ద జాతర**

మండలంలోని రామన్నపేట్ గ్రామశివారులో అయ్యలగుట్ట వద్ద రాజరాజేశ్వరస్వామి జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జాతర ఉత్సవాలలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రామన్నపేట్‌తో పాటు చుట్టు పక్కల ప్రజలు అధిక సంఖ్యలో అయ్యలగుట్ట ఆలయానికి చేరుకొని బెల్లం నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం రాజరాజేశ్వరస్వామికి అభిషేకం, యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించారు. బలిగుట్టపైన జెండా ఎగురవేయడం అనంతరం ఎడ్లబండ్లు, వాహనాలు గుట్ట చుట్టు తిప్పారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**● యంచ జగదాద్రి దేవి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు**

**నవీపేట:** మండలంలోని యంచలోని ఓంజగదాద్రి దేవి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 16నుంచి ఫిబ్రవరి 2వరకు జరిగే ఆలయ 6వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారిని ఓం కామాక్షి దేవి అవతారంలో హంస వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఓం జగదాద్రి దేవి ఆలయ వ్యవస్థాపకురాలు స్వర్ణ కమల లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.


శ్రీరాంపూర్‌లో చిలుకల చిన్నమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

**● శ్రీరాంపూర్‌లో ఘనంగా చిలుకల చిన్నమ్మ జాతర**

**ముప్కాల్:** బాల్కొండ మండలం శ్రీరాంపూర్ గ్రామంలో చిలుకల చిన్నమ్మ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవర దండి అమావాస్యను పురస్కరించుకొని ప్రతీఏటా వీడీసీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర నిర్వహించారు. ఉదయం గ్రామంలో వలగొడుగులు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా గంగాజలాలను తీసుకువచ్చి చిలుకల చిన్నమ్మకు గంగాజలాలతో అభిషేకం నిర్వహించారు.అలాగే అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసిన బారులుతీరి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన అనంతరం కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు. ఈ జాతరకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా బాల్కొండ, ముప్కాల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**● నికాల్‌పూర్‌లో ఘనంగా చిలకల చిన్నమ్మ జాతర**

**డొంకేశ్వర్:** డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలో చిలుకల చిన్నమ్మ జాతరకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి విగ్రహాలను గంగాస్నానానికి తీసుకువెళ్లి డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. పాడి పంటలు చల్లగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సుభాష్, భీమ్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు సుమన్, తదితరులు పాల్గొన్నారు.

**జక్రాన్‌పల్లి:**మండలంలోని కలిప్యాక్ గ్రామంలో అనంతగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరుగతాయని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. గురువారం గణపతిపూజ, అఖండ దీపరాధన, పుణ్యాహవచనం జరుగునున్నాయని తెలిపారు. శుక్రవారం మండలరాధన,విగ్రహప్రతిష్ఠాపన,కుంభాభిషేకం, పూర్ణహుతి, చేపట్టనున్నట్టు తెలిపారు.

# త్రివేణి సంగమం వద్ద గోదారమ్మకు మహా హారతి

రెంజల్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం భక్తులతో మౌని అమావాస్య సందర్భంగా కొత్త శోభను సంతరించుకుంది. బుధవారం మౌని అమావాస్య కావడంతో త్రివేణి సంగమ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి నదిలో వదిలి మొక్కులు తీర్చుకున్నారు. నదిలో స్నానాలు చేస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తులు గోదావరి పరివాహక ప్రాంతమైన కందకుర్తి త్రివేణి సంగమం క్షేత్రానికి అధిక సంఖ్యలో వచ్చి శివాలయంలో పూజలు చేసి గంగా స్నానం ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు.

**● తుంగిని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు**

**నవీపేట:** మండలంలోని తుంగినిలోని చారిత్రక హనుమాన్ మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మౌని అమావాస్యను పురస్కరించుకుని స్థానిక గోదావరిలో పెద్ద ఎత్తున భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం గోదావరి ఒడ్డున ఉన్న చారిత్రక హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.


గోదావరి నదిలో స్నానాలు చేస్తున్న దృశ్యం

# ఒకటి కాదు.. రెండు హత్యలు

**● తల్లిని చంపిన కుమారుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**● మరో మహిళనూ చెరువులో ముంచి హత్య**

కోటగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లా జల్లాపల్లి ఫారంలో ఇటీవల జరిగిన వృద్ధురాలి హత్య కేసులో కొడుకును అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులకు విస్తుపోయే నిజం తెలిసింది. నిందితుడు తల్లినే కాకుండా డబ్బుల కోసం మరో వృద్ధురాలిని కూడా చెరువులో ముంచి హత్య చేసినట్టు తేలింది. బుధవారం జిల్లాలోని కోటగిరి పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రుద్రూరు సీఐ కృష్ణ కేసుకు సంబంధించిన వివరాలు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జిల్లాలోని పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారం గ్రామానికి చెందిన నేనావత్ మంగ్లీబాయి(72) మూడు రోజుల క్రితం హత్యకు గురైంది. తల్లి ఆభరణాలు, పింఛన్ డబ్బుల కోసం కన్న కొడుకు రాములు ఆమెను గ్రామ శివారులోని చెరువులో ముంచి.. ఆ పై గొంతు నులిమి హత్య చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తుండగా బుధవారం పోతంగల్ చెక్‌పోస్టు వద్ద రాములును పట్టుకున్నారు. అతన్ని తమదైన శైలిలో విచారించగా.. తన తల్లి మంగ్లీబాయిని హత్య చేయడంతో పాటు మరో మహిళను కూడా ఆభరణాలు, డబ్బుల కోసం ఇలాగే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. మూడు నెలల క్రితం పోతంగల్ మండలంలోని నాగేంద్రపురం గ్రామానికి చెందిన గైని యాదమ్మ (62)ను సైతం బీర్కూర్ మండలం బరంగెడ్డి సమీపంలోని చెరువులో ముంచి హత్య చేసినట్టు విచారణలో వెల్లడైంది. నిందితుడి వద్ద వెండి ఆభరణాలతో పాటు నగదును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.


హత్య కేసుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ

## అంకాపూర్‌ను సందర్శించిన నల్గొండ జిల్లా రైతులు


అంకాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న నల్గొండ జిల్లా నర్సింగ్‌పూర్ రైతులు

ఆర్మూర్‌రూరల్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని బుధవారం నల్గొండ జిల్లా నర్సింగ్‌పూర్ గ్రామ రైతులు సందర్శించారు. పంటల సాగులో అంకాపూర్ గ్రామ రైతులు అవలంభిస్తున్న పద్ధతులను అడిగితెలుసుకున్నారు. ఎర్రజొన్న, పసుపు, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగును పరిశీలించారు. పంట దిగుబడులు, క్రయవిక్రయాలను, మార్కెటింగ్ సౌకర్యం, తదితర వివరాలను తెలుసుకున్నారు. విత్తన కంపెనీలను, గోదాంలను సందర్శించి విత్తన ప్రాసెస్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. జాతీయరహదారి పక్కన ఉన్న కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. గ్రామంలో పచ్చి బుట్ట పంట సాగు విధానం, పసుపు, ఎర్రజొన్న, సజ్జ పంటలపై కేకే భాజన్న నల్గొండ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హారిక, ఏఈవో సవిత, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## పులి ఆనవాళ్ల కోసం పరిశీలన


పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

ఎడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామ శివారులో అలీసాగర్ ప్రాజెక్టు సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద మంగళవారం రాత్రి బ్యాంకు ఉద్యోగిని పులి వెంబడించిందనే సమాచారం మేరకు బుధవారం నార్త్ రేంజ్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌లు కలిసి పులి ఆనవాళ్ల కోసం పలు పాదముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో పెద్ద పులులు లేవని జిట్టపులులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గత 6 నెలల క్రితం కూడా జిట్టపులి కనిపించిందనే సమాచారం వచ్చిందని, ఇపుడు ఇక్కడ ఎలాంటి ఆనవాళ్లు కనపడలేవని వారు అన్నారు. జిట్టపులి రాత్రి, ఉదయం సమయంలో మాత్రమే ఆహారం కోసం బయట తిరుగుతాయని, ఆ సమయాల్లో ప్రజలు ఒంటరిగా వెళ్లకుండా గుంపులు గుంపులుగా వెళ్లాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ ఏరియాలో పులి బోనులు, కెమెరాలు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామని, ప్రతీ రోజు తమ సిబ్బంది గస్తీ తిరుగుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన కోరారు.

## జీజీ నడ్కుడలో పారిశుధ్య పనులు



జీజీ నడ్కుడలో పారిశుధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి సుప్రియ

డొంకేశ్వర్,జనవరి29(ఆంధ్రజ్యోతి):మండలం జీజీనడ్కుడ గ్రామంలో పడకేసిన ప్రత్యేకపాలన గ్రామంలో చెత్తాచెదారం పెరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నారని ఈనెల 27న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కార్య దర్శి సుప్రియ స్పందించారు.గ్రామంలో పారిశుధ్య సిబ్బందితో డ్రైనేజీలో పేరు కుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కాలువల్లో మురుగు నీరు నిల్వ కుండా చర్యలు తీసుకున్నారు. డ్రైనేజీ చుట్టు శుభ్రంగా చేయించి బ్లీచింగ్‌పౌడర్ చల్లారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో
## ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

మెండోర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డ్రంక్అండ్‌డ్రైవ్‌లో చంద్రశేఖర్ అనే వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వెల్కటూర్ గ్రామానికి చెందిన చల్ల చంద్రశేఖర్ ఈ నెల 2న డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడడంతో బుధవారం ఆర్మూర్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై నారాయణ తెలిపారు.

### భీమ్‌గల్‌కు చెందిన వ్యక్తికి..

భీమ్‌గల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనం నడిపిన పట్టణ కేంద్రానికి చెందిన విభూది దేవిదాస్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. భీమ్‌గల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడడంతో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

### ఉప్లూర్ గ్రామానికి చెందిన వ్యక్తికి ..

కమ్మర్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన సాదుల శ్రీనివాస్ అనే వ్యక్తి మద్యంతాగి వాహనం నడిపినందున అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసునమోదయ్యింది. ఈ కేసులో ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ కేసు విచారణ అనంతరం సాదుల శ్రీనివాస్‌కు రెండు రోజుల జైలుశిక్ష విదించినట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్ రెడ్డి తెలిపారు.

**బోధన్‌రూరల్:** బోధన్ పట్టణంలోని మంగళవారం రాత్రి అధిక మద్యం తాగి వాహనం నడిపిస్తున్న జింక గంగాధర్ అనే వ్యక్తిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శేషతల్ప సాయి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరోజు ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమం ఉంటుందని, మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు.

## ఇందల్వాయిలో దొంగతనం

ఇందల్వాయి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి గ్రామంలో మంగళవారం రాత్రి ఆసది రాజేశ్వరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దొంగ ఇంట్లోకి చొరబడి ఇంట్లో దాచుకున్న బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించుకొని పారిపోగా బాధితురాలు రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్సై మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసి గాలించగా అదే గ్రామానికి చెందిన ఆసది రాజేష్‌ను పట్టుకొని దొంగిలించిన డబ్బు, బంగారంతో పాటు బంగారం తీసుకున్న వ్యక్తి తరుణ్‌లను పట్టుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి
## చెరువులో పడి యువకుడి మృతి

రుద్రూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన రుద్రూర్‌లో చోటు చేసుకుంది. రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం రుద్రూర్ గ్రామానికి చెందిన దాల్‌మల్కు బాబయ్య (22) చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చేపల వల చుట్టుకుని చెరువులో పడి మృతి చెందాడు. దాల్‌మల్కు బాబయ్యకు ఇద్దరు కుమారులు. ఈ నెల 28 మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో నేను, నా పెద్దకొడుకు అన్నం తినిపడుకున్నాము. ఉదయం 6 గంటలకు లేచి చూసేసరికి నా పెద్ద కొడుకు దాల్‌మల్కు బాబయ్య కనపడలేదు. ఉదయం 10 గంటలు అయిన ఇంటికి రాకపోవడంతో, ఇంట్లో చేపల వల కూడా లేకపోవడంతో అనుమానం వచ్చి మా అన్న దాల్‌మల్కు చిన్న బాబయ్యకు సమాచారం అందించి ఇద్దరం కలిసి కాశీందుల వద్ద చెరువులో వెతుకగా, చెరువులో మృతదేహం లభించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటన స్థలానికి ఎస్సై సాయన్న చేరుకుని ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు

## అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలి

బీర్కూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీర్కూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అభయహస్తం పథకం కింద 34 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో రేషన్ కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చాలని 24 లక్షల మంది, కొత్త రేషన్ కార్డుల కోసం పది లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సీఎం వెంటనే స్పందించి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేసి ప్రజలకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగేళ్ల సాయి కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి యోగేష్, బీజేపీ సీనియర్ నాయకులు సాయిబాబా, వడ్ల బస్వరాజు, గజేందర్, కార్యకర్తలు శంకర్, ఉప్పు శ్రీనివాస్, తామల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల వితరణ

ఎల్లారెడ్డి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పదవ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఎంఐఎం అధ్యక్షుడు రజాక్, షఫీ బుధవారం ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. పదవ తరగతి పరీక్షలు 21 మార్చి నుంచి ప్రారంభమవుతున్నందున శ్రద్ధతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని మండల విద్యాధికారి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి వెంకటేశం, మహ్మద్ ఇలియాస్, మహ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## సీడీసీ చైర్మన్, డైరెక్టర్‌ల ప్రమాణస్వీకారం

సదాశివనగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రిషుగర్స్ చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్‌గా అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన మహ్మద్ ఇర్షాదుద్దీన్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. కామారెడ్డి సీడీసీ కార్యాలయంలో అసిస్టెంట్ బోధన్ వెంకటరవి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం నిర్వహించారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లుగా పీర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు.తనపై పూర్తి నమ్మకంతో చెరుకు అభివృద్ధి మండలి బాధ్యతలు అప్పజెప్పిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. గాయత్రిషుగర్స్ పరిధిలోని చెరుకు రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తూ రైతులకు అన్నిసౌకర్యాలు అందించేవిధంగా శాయశక్తుల కృషిచేస్తానన్నారు.

## ప్రతీ విద్యార్థికి అపార్ జనరేట్ చేయించాలి

భీమ్‌గల్‌రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడి జనరేట్ చేయించాలని ఎంఈవో స్వామి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, సిలబస్ సకాలంలో పూర్తిచేయాలన్నారు.

## అనుమానమే పెను భూతమై..

**● భార్యను దారుణంగా హతమార్చిన భర్త**

**● బోర్గాంలో ఘటన**


స్వర్ణ(ఫైల్)

రెంజల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పచ్చని సంసారంలో అనుమానం పెనుభూతమై విషాదాన్ని మిగిల్చిన ఘటన రెంజల్ మండలం బోర్గాం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చీరడి స్వర్ణ(38)అనే వివాహితను భర్త అనుమానంతో గొంతు నులిమి చంపి గ్రామ శివారులోని చెరువులో పడవేసినట్లు సీఐ విజయ్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోర్గాం గ్రామానికి చెందిన చీరడి పోతన్న అనే వ్యక్తి తన భార్య అయిన చీరడి స్వర్ణపై అనుమానంతో భార్యను హత్య చేసి చెరువులో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని, స్థానికులు గ్రామస్థుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని వెలికి తీసి భర్తను అదుపులోకి తీసుకోవడంతో తానే హత్య చేసినట్లు ఒప్పుకోవడం జరిగిందన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న పోతన్న ఎలాగైన కడతేర్చాలన్న ఉద్దేశంతో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో హతమార్చి చెరువులో పడవేశారని సీఐ విజయ్ బాబు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించి భర్త పోతన్నను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

వర్ని, జనవరి29 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలోని తగిలేపల్లి గ్రామంలో గత 12సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఏడుగురు ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. తగిలేపల్లి గ్రామ కమిటీ, గ్రామస్థుల సమక్షంలో ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గుజ్జ శంకర్, ఉపాధ్యక్షులు గైని గోపి, గుజ్జ అశోక్, ప్రధానోపాధ్యాయులు రత్నాకర్, కరుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు


కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్న దృశ్యం

రుద్రూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలో గల ప్రాథమిక పశువైద్య కేంద్రంలో బుధవారం పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఇందులో భాగంగా 15 పెంపుడు కుక్కలకు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సాయిరాజ్, వైద్య సిబ్బంది గంగారాం పాల్గొన్నారు.

## హోటళ్లు, బేకరీలలో ప్లాస్టిక్‌పై తనిఖీలు


బేకరీ యాజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు హోటళ్లు, బేకరీలలో మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు హోటళ్లు, బేకరీలలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం, పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించి పలు షాప్ యాజమానులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి,మున్సిపల్ సిబ్బంది ప్రశాంత్, నరేష్, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

## స్నూకర్ పార్లర్ వద్ద ఇరువర్గాల మధ్య గొడవ

**● కర్రలతో పరస్పర దాడులు ● ఒకరికి తీవ్ర గాయాలు**

ఖిల్లా,జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్డులో గల ఓ స్నూకర్ పార్లర్ వద్ద ఒకే వర్గానికి చెందిన ఇరువురు యువకుల మధ్య బుధవారం రాత్రి పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఈ గొడవలో కర్రలతో ఒకరిపై ఒకరు పరస్పర దాడులు చేసుకున్నారు. వివరాలను ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి తెలిపారు. ఫిరోజ్‌కు బర్కత్‌పురకాలనీకి చెందిన బాసముల్లాఖాన్‌ల మధ్య గతంలో కళాశాల వద్ద జరిగిన పాత కక్షలున్నాయి. అదే విషయాన్ని మనసులో పెట్టుకున్న ఫిరోజ్ స్నూకర్ పార్లర్ వద్ద ఉన్న బాసముల్లాఖాన్‌ను గుర్తించి ఆయనపై గున్నా కొందరు అనుచరులతో కలిసి కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో బాసముల్లాఖాన్‌కు తలకు బలమైన గాయాలు అయ్యాయి. ప్రస్తుతం బాసముల్లాఖాన్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. బాధితుడి తండ్రి అబ్దుల్లాఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## మొరం అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ గ్రామ శివారులో గల గుట్ట ప్రాంతం నుండి అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ తారాబాయి బుధవారం ఉదయం పట్టుకున్నారు. వారి వద్ద వే బిల్లులు లేకపోవడంతో మొరం ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వర్ని మండల కేంద్రంలోని ఒక సంస్థకు మొరం కావాలని అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వే బిల్లులు ఇవ్వక ముందే ఉదయం నుంచి మొరం తరలిస్తుండటంతో రెవెన్యూ అధికారులు మూడు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

## 36 వార్డులకు అధికారుల నియామకం

ఆర్మూర్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 36వార్డులకు బుధవారం వార్డు అధికారులను నియమించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. వార్డులలో నెలకొన్న పారిశుధ్యం, నీటి సరఫరా, పన్నుల వసూళ్లు, మొక్కల సంరక్షణ, వీదిదీపాల నిర్వహణ, తదితర వాటికి సంబంధించిన వార్డుల్లో ఏదైన సమస్యలు ఉంటే ప్రజలు సమస్య పరిష్కారం కోసం వార్డు అధికారులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ పరీక్షలు

ముప్కాల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్‌లోని భవిత సెంటర్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బుధవారం ఫిజియో థెరపీ క్యాంపు నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. దివ్యాంగులు ఫిజియో థెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఫటా..ఫట్...

కొత్త మెనూ ప్రకారం

# విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నాం!

● పి.కృష్ణ, వెనుకబడిన తరగతుల వసతి గృహ వెల్ఫేర్ ఆఫీసర్, నిజాంసాగర్



వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో ప్రభుత్వం అందించే కొత్త మెనూ ప్రకారంగా విద్యార్థులకు అల్పాహారం భోజనాన్ని అందించడం జరుగుతుందని వెల్ఫేర్ ఆఫీసర్ పి.కృష్ణ 'ఆంధ్రజ్యోతి'తో వెల్లడించారు. వారానికి రెండు సార్లు చికెన్ అందిస్తున్నాం. పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తాం.

**ఆంధ్రజ్యోతి :** నిజాంసాగర్ ఉమ్మడి మండలంలో ఉన్న వెనుక బడిన తరగతుల బాలుర గృహంలో ఎంత మంది విద్యార్థులు విద్యా భ్యాసం చేస్తూ ఉన్నారు?

**వెల్ఫేర్ ఆఫీసర్:** నిజాంసాగర్ ఉమ్మడి మండలంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం ఒకటే ఉంది. ఈ వసతి గృహంలో వంద మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తూ ఉంటారు.

**ఆంధ్రజ్యోతి:** బాలుర వసతి గృహంలోని ఏ తరగతి నుంచి విద్యాభ్యాసం చేయించనున్నారు. ఏఏ తరగతుల పిల్లలను చేర్చుకుంటారు?

**వెల్ఫేర్ ఆఫీసర్:** బాలుర వసతి గృహంలో ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేసే విద్యార్థులను జూన్ మాసంలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తాం. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఖాళీలను బట్టి హాస్టల్‌లో ప్రవేశం కల్పిస్తాం.

**ఆంధ్రజ్యోతి:** వసతి గృహంలో ప్రభుత్వం కొత్త మెనూ అందిస్తుంది ఏ తరగతులకు ఎంత డబ్బు ఖర్చు చేస్తుంది?

**వెల్ఫేర్ ఆఫీసర్ :** ఏడాది ప్రభుత్వం వసతి గృహంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు కొత్త మెనూ ప్రకటించింది. మూడవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు నెలకు రూ. 1330 రూపాయలను, ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతిలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు 1540 రూపాయలు ఖర్చు చేస్తుంది.

**ఆంధ్రజ్యోతి:** బాలుర వసతి గృహంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు అల్పాహారంతో పాటు మాంసాహారం ఎప్పుడెప్పుడు అందిస్తారు?

**వెల్ఫేర్ ఆఫీసర్ :** వసతి గృహంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు వారానికి ఐదు సార్లు ఒక్కొక్క గుడ్డు 5 అరటి పండ్లు, బుధ, ఆదివారాల్లో చికెన్, కర్రీ అందిస్తాం.

**ఆంధ్రజ్యోతి:** వసతి గృహంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారా పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారా?

**వెల్ఫేర్ ఆఫీసర్:** వసతి గృహంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు అందరికీ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తాం. పదవ తరగతిలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు పాఠశాలను ప్రత్యేకత నిర్వహిస్తూనే ఉన్నారు.

**ఆంధ్రజ్యోతి :** హాస్టల్ భవన సముదాయాలు గదుల కొరతతో పాటు సిబ్బంది కొరత ఉందా?

**వెల్ఫేర్ ఆఫీసర్ :** హాస్టల్ భవన సముదాయం ప్రభుత్వం నిర్మించిన భవనం గదిలో కొరత లేదు. హాస్టల్‌లో ఒకరు రెగ్యులర్, ఇద్దరు కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. ● (ఆంధ్రజ్యోతి, నిజాంసాగర్)

## వైభవంగా అన్నపూర్ణేశ్వరి జాతర

సిరికొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరి జాతర బుధవారం వైభవంగా జరిగింది. సాయంత్రం వేళ రథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పూట కొండపైన అన్నపూర్ణేశ్వరి ఆలయం వద్ద భక్తులు భారీగా చేరుకొని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో కమిటీ సభ్యులు యజ్ఞం నిర్వహించారు. జాతరకు వచ్చిన భక్తుల కోసం అన్న సత్రం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నపూర్ణేశ్వరిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు సిరికొండ, ధర్పల్లి, భీంగల్ మండలానికి చెందిన భక్తులు భారీగా హాజరయ్యారు. మౌని అమావాస్య సందర్భంగా సిరికొండ సమీపం లోగల లొంక రామ లింగేశ్వర స్వామిని ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. రామ లింగే శ్వరుడిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.



జాతరలో పాల్గొన్న భక్తులు



శిఖం భూమిలో వరి నాట్లు వేసిన దృశ్యం



హద్దు కాలువను దాటి వరి నాట్లు వేసిన దృశ్యం

# తేలని శిఖం భూముల లెక్క!

● చెరువుల పక్కనున్న భూములపై రాని స్పష్టత ● ఫిర్యాదులు వచ్చినా స్పందించని అధికారులు

ఎడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేటికి చెరువుల పక్కనే ఉన్న శిఖం భూముల లెక్కపై స్పష్టత రాలేదు. కొంతమంది వివిధ రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో యథేచ్ఛగా శిఖం భూములను కబ్జా చేసి పంట కొనసాగిస్తున్నారు. వీటిపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆ చెరువులను ఆనుకుని ఉన్న రైతులు శిఖం భూమిని కాస్తా కబ్జా చేసి దర్జాగా పంట సాగు చేస్తున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఉన్న నాలుగు చెరువుల శిఖం భూములు కబ్జాకు గురయ్యాయి. అందులో కొందరు శిఖం భూములకు పట్టాలు కూడా సృష్టించారు. వర్షాకాలంలో చెరువులు పూర్తిగా నిండడంతో కబ్జా చేసిన శిఖం భూమిలో వేసిన పంట మునగగానే రాత్రిళ్లు చెరువుల తూములు ఎత్తి నీరు కిందికి వదిలిన సంఘటనలు ఉన్నాయి. దాంతో చెరువు కింద ఉన్న భూములు మునిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వేసవి కాలంలో చెరువులు నిండకుండా నిజాంసాగర్ డీ46 కెనాల్ నుంచి ఎడపల్లి చెరువులలోకి వచ్చే తూముల్లో బండరాళ్లు పెట్టి చెరువులు నిండకుండా చేస్తూ యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతూ పంటలు సాగు చేస్తున్నారు. ఈ కబ్జాలపై సంబంధిత అధికారులకు ఎన్నో మార్లు ఫిర్యాదు చేసినా అధికారులు అటువైపు వెళ్లిన దాఖలాలు కనపడలేవు. ఈ మధ్యనే ఎడపల్లి మండల కేంద్రంలోని పెద్ద చెరువులో దుబ్బా తండా గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసి పంట సాగిస్తున్నారని, దీనిపై ఆ గ్రామానికి చెందిన కొందరు ఎడపల్లి తహసీల్దార్‌కు రెండు సార్లు ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు అధికారులు అటువైపు వెళ్లలేదంటే సరిస్థితి అర్థమవుతుంది.

### నీదా.. నాదా.. అంటూ పంచాయితీ

గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులను పునరుద్ధరించింది. చెరువు పూడికతీత, చెరువు గట్టు బలోపేతం, పూర్తి చెరువు లెవలులను నిర్ధారించి ట్రెంచ్ కట్ చేసి హద్దు కాలువలు తీసింది. అప్పటికే శిఖం భూమిలో కబ్జాలో ఉన్న కొందరిని తొలగించింది. ఆ భూముల్లో ఇప్పుడు దుబ్బ తండా గ్రామానికి చెందిన నేనావత్ గోపాల్‌తో పాటు మరి కొందరు ట్రెంచ్ కట్ చేసిన దానిని దాటి చెరువులో వరి నాట్లు వేశారు. దీనిపై గతంలో ఆ భూమిని సాగు చేసిన రైతులు ఎడపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వారిపై కేసు పెట్టినట్లు సమాచారం.

### చేతులెత్తేసిన రెవెన్యూ అధికారులు

చెరువుల శిఖం భూముల కబ్జాలపై ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటికే చాలా ఫిర్యాదులు వచ్చినా వారు పట్టించుకోక తమకేమీ పట్టనట్లు చేతులెత్తేశారు. దీంతో శిఖం భూముల్లో కబ్జాల పర్వం కొనసాగుతుంది. చెరువుల పూర్తి సామర్థ్యాన్ని గుర్తించి కాలువ తీసినా ఆ కాలువను దాటి శిఖం భూములను కబ్జా చేయడంతో చెరువులలో నీటి సామర్థ్యం తగ్గిందని, వేసవి కాలంలో పశువుల కాపరులు ఆ శిఖం భూముల్లోనే పశువులను మేపుతారని పశువులు మేయకుండా కబ్జాలకు పాల్పడుతున్నారని, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి శిఖం భూముల కబ్జాలను తొలగించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

### కబ్జాదారులను గుర్తించి కేసులు పెడతాం

●ఏఈ ఇరిగేషన్ రాజ్యలక్ష్మి

చెరువుల శిఖం భూముల కబ్జాపై నీటిపారుదల శాఖ ఏఈ రాజ్యలక్ష్మిని వివరణ కోరగా ఎడపల్లి పెద్ద చెరువుతోపాటు మండలంలోని పలు చెరువుల్లో శిఖం భూమి కబ్జాకు గురైన మాట వాస్తవమేనని, కబ్జా చేసిన రైతులకు మూడు రోజుల వ్యవధి ఇచ్చామని దుబ్బా తండా, ఎడపల్లి గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో దండోరా వేయించామని తెలిపారు. శిఖం భూమిలో వేసిన పంటలను సదరు రైతులు తొలగించకపోతే, కబ్జాదారులను గుర్తించి వారిపై కేసులు పెడతాం. శిఖం భూమిలో కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎవరు కూడా శిఖం భూమిలో పంటలు వేయవద్దని ఇరిగేషన్ ఏఈ అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య

నిజామాబాద్ అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వారి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. గతంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశాయని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం తప్పక వస్తుందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేసిన వారు మొదట సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి గెలవగానే ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వం చెంతన చేరడం వల్లే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రైవేటు పాఠశాలల సమస్యలతో పాటు వాటిలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ సమావేశంలో తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్యదర్శి బట్టు బద్రీనాథ్, రామకృష్ణ, సుదర్శన్, కొండ ఆశన్న, రెంజర్ల నరేష్, మాజీ బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# బుగ్గ రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

● మాఘ అమావాస్య సందర్భంగా బారులు తీరిన భక్తులు



కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు



శనేశ్వర దేవుడికి ప్రత్యేక పూజలు

భక్తి



రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

రామారెడ్డి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న దక్షిణ కాశీగా వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి, పద్దేని మిది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామ అడవి ప్రాంతంలో వెలిసిన స్వయంభూ బుగ్గ రామ లింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మాఘ అమావస్య సందర్భంగా భక్తులు అధిక సంఖ్య లో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కాలభైరవ స్వామి ఆలయంలో ఓం భైరవ.. ఓం ఓం కాలభైరవ స్వామి మద్ది కుంట గ్రామ అడవి ప్రాంతంలో స్వయం భూ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఓం నమో భగ వతే వాసు దేవాయ నమఃశివాయ అంటూ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల సమీపంలో ఉన్న బావి వద్ద, కొనేరు వద్ద స్నానాలు చేసి దైవ దర్శనం కోసం బారులు తీరారు. కామారెడ్డి జిల్లాతో పాటు పలు జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కాలభైరవ స్వామి ఆలయం పక్కనే ఉన్న శనేశ్వరుడు, హనుమాన్ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ, జంగం ప్రభాకర్ స్వామి, ఆలయ ఈవో బుర్ల ప్రభురాం చంద్రం గుప్తా, ఆలయ కమిటీ చైర్మెన్ లచ్చిరెడ్డి, ధర్మకర్తలు, రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారులు, వైద్యులు, ఆలయ అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా

● పాలిష్ చేసి తిరిగి దుకాణాల ద్వారా అమ్మకాలు జరుపుతున్నారనే ఆరోపణలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు



పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్సై (ఫైల్)

గాంధారి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా రోజురోజుకు పెరిగిపోతుంది. ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేసే బియ్యాన్ని కొంతమంద దళారులు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తు సోమ్ము చేసుకుంటున్నారు. గత పది రోజుల క్రితం గాంధారి ఎస్సై ఆంజనేయులు మండలంలోని పొతంగల్ కలాన్ గ్రామసమీపంలో అక్రమంగా తరలిస్తున్న 11 క్వింటాళ్ల 30 కిలోల బియ్యాన్ని పట్టుకున్నారు. ఇలా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యం ఎప్పటికప్పుడు అక్రమంగా తరలిస్తు పాలిష్ చేసి తిరిగి అధిక ధరలకు దుకాణాల ద్వారా విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తక్కువ ధరకు కొని.. ఎక్కువ ధరకు విక్రయం

ప్రతినెల 1 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అ మ్మకాలు జరుపడంతో పాటు అక్రమంగా ఇతర ప్రాంతాలకు సరాఫరా చేస్తున్నారు. మండలంలో రేషన్ డీలర్ల నుంచి కొనుగోలు చేసుకుంటూ బాన్సువాడ,బోధన్ మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందులో కొందరు డీలర్లు ప్రస్తుతం వచ్చిన కోటా బియ్యం సరిగా లేవని ఆ బియ్యాన్ని మీరు తినలేరని మాయచేస్తు తాము కిలోకు రూ.10 నుంచి 14 వరకు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని ఆఫర్‌లు ఇస్తున్నారు. దీంతో అమ్మకం జరిపే డీలర్లే చెబుతున్నారని ప్రజలు వాటిని అక్కడికక్కడే విక్రయం జరుపుతున్నారు. ఆ తర్వాత ఎక్కువ ధరకు దళారులకు విక్రయించి సోమ్ముచేసుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో రైస్‌మిల్లుల్లో పీడీయస్ బియ్యాన్ని నూకలుగా మార్చి కొనుగోలు జరుపుతున్నారు. ఇవ్వన్ని తెలిసిన సంబంధిత అధికారులు అటువైపు కన్నెతి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

### చద్మల్ తండాలో అక్రమ దందా..!?

మండలంలోని చద్మల్ తండాలో కొంతమంది రేషన్‌బియ్యాన్ని కొనుగోలుచేసి చద్మల్ నుంచి రాత్రివేళలో బోధన్, నిజామాబాద్‌కు తరలిస్తు అక్రమ దందాకు తెరలేపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. చద్మల్ తండా మీదుగా వెళ్లడానికి వీలుగా ఉండడంతో అక్కడ నుంచి రాత్రి 10 తర్వాత తరలిస్తున్నారని స్థానికంగా ఉన్న పలువురు పేర్కొనడం గమనార్హం. ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని సరఫరా చేస్తుంటే వాటిని ప్రజలకు మాయమాటలు చెప్పి దళారులు, కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నాలుచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీడీఎస్ బియ్యం రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పసుపు పరిశోధన కేంద్రాన్ని

# సందర్శించిన విద్యార్థినులు



కమ్మర్‌పల్లిలో పసుపు పంటలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మహేందర్

కమ్మర్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం పసుపు పరిశోధన కేంద్రాన్ని బుధవారం రాజన్న సిరిసిల్లా జిల్లా బాబుజగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మహేందర్, శ్రీనివాస్ పసుపు పంట సాగు విధానం కుర్కుమిన్ శాతం, దిగుబడులు, పంటలపై ఆశించే దుంపకుల్లు తదితర చీడపీడలు, వాటి నివారణ చర్యలు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినుల వెంట జగిత్యాల జిల్లా పూడూరుకు చెందిన ఆదర్శ రైతు, వ్యవసాయ విద్యాలయం సాంకేతిక సలహా మండలి మాజీ సభ్యులు రామ్‌రెడ్డి ఉన్నారు. అగ్రికల్చర్ వర్క్స్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రాంలో భాగంగా కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం సందర్శన కోసం వచ్చినట్లు రాజన్న సిరిసిల్లా జిల్లా బాబు జగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల నాల్గవ సంవత్సరం విద్యార్థినులు తెలిపారు.


## CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, **KONDAVEETI RASHMIKA** D/o KONDAVEETI RAVINDER REDDY Aged 28 years, Occ: Doctor, R/o: H.No.2-36/1/12/46/B, BHEL Executives & Friends Colony, Chandanagar, Serilingampally (M), R.R. Dist, Hyd-500050, have the different names ie, KONDAVEETI RASHMIKA in my Passport No.(M4109010) & K. RASHMIKA REDDY in my Aadhaar (5476 7710 1773). Now I hereby declare that both names are for the same person ie, myself.
AJH-198523

**CHANGE OF NAME**

I, NEERADI GODHAVARI W/O NEERADI GANGADHAR (OLD NAME) R/O. H.NO. 9-147/2, (V)&(M): DHARPALLY, NIZAMABAD DIST., T.G., HAVE CHANGED MY NAME AS NEERADI GODAVARI W/O NEERADI GANGADHAR (NEW NAME)
AJZ

ప్రతి రోజూ... క్లాసిఫైడ్స్
ప్రతి 4 లైన్లకు 190/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453


## సంక్షేమ పథకాల..

# దరఖాస్తు ఫారాలు లేక ఇబ్బందులు




రుద్రూర్ గ్రామ పంచాయతీ

● బయట కొనుగోళ్లు చేస్తున్న ప్రజలు
● గ్రామ పంచాయతీల్లో లేని ఫారాలు
● అందుబాటులో ఉంచాలంటున్న ప్రజలు

రుద్రూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాల్సిన దరఖాస్తు ఫారాలు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని రుద్రూర్ మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసాలో అర్హులకు కాకుండా అనర్హులకు వచ్చాయని గ్రామసభలో మండలంలోని గ్రామాల్లో ప్రజలు నిలదీసిన సంఘటనలు విదితమే. దీంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఇది నిరంతర ప్రక్రియ అని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో సంక్షేమ ఫలాలు అందుతాయని కోటి ఆశలతో ప్రజలు దరఖాస్తు చేసుకోవడానికి గ్రామ పంచాయతీల వద్ద బారులు తీరారు. దరఖాస్తు చేసుకోవడానికి గల అప్లికేషన్ ఫారాలు బయట కొనుగోలు చేసుకోవాలని చెప్పడంతో ప్రజలు ఇతర షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మీ సేవాలో దరఖాస్తు అప్లికేషన్ ఫారాలు రూ. 5 ఉంటే, ఇదే అదునుగా భావించిన వ్యాపారులు మాత్రం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న కిరాణ షాపు, జిరాక్స్ సెంటర్‌లో దుకాణా వ్యాపారులు ఒక్కో దరఖాస్తు ఫారానికి రూ. 10 వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా దరఖాస్తు ఫారం రాయడానికి ప్రజల వద్ద నుంచి రూ. 10 నుంచి 20 వసూలు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కష్టం నమ్ముకునే నిరుపేదలకు భారం పడుతుందని ఉన్నత అధికారులు వెంటనే స్పందించి దరఖాస్తు ఫారాలను బయట కొనుగోలు చేయకుండా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే అందుబాటులో ఉంచాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలి

● ధర్మారం వెంకటేష్, రుద్రూర్ గ్రామస్థుడు



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు కాకుండా అనర్హులకు వచ్చాయని గ్రామసభల్లో అధికారులకు నిలదీయడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. దాంతో నిరుపేదలు దరఖాస్తులు చేసుకోవడానికి గ్రామ పంచాయతీ వద్దకు బారులు తీరుతున్నారు. దరఖాస్తు చేసుకోవాలంటే బయట నుంచి దరఖాస్తు ఫారం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న కిరాణషాపు, జిరాక్స్ సెంటర్‌లో దుకాణా వ్యాపారులు ఒక్కో దరఖాస్తు ఫారానికి రూ. 10 వసూలు చేస్తున్నారని, దరఖాస్తు ఫారం రాయడానికి కూడా రూ. 10 నుండి 20 వసూలు చేస్తున్నారు. దీంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దరఖాస్తు ఫారాలను బయట కొనుగోలు చేయకుండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని కోరారు.

## మున్సిపల్ కమిషనర్ సీసీ రాకేష్‌పై వేటు



నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయం

సుభాష్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్ కుమార్ సీసీ రాకేష్‌పై వేటు పడింది. రెండు రోజుల క్రితం నగర పాలక సంస్థ సీసీపై వేటు వేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కమిషనర్ క్యాంప్ క్లర్క్ సీసీగా అహ్మద్ ఇర్ఫాన్‌ను నియమించారు. రాకేష్‌ను ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్‌ను కమిషనర్ సీసీగా నియమించారు. గత కొన్ని నెలలుగా నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సీసీలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. మందమకరంద్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో సీసీగా ఉన్న అమ్జాద్‌పై ఆరోపణలు రావడంతో అమ్జాద్‌ను తన సొంత స్థానం రెవెన్యూ విభాగంలోని డొంకేశ్వర్‌కు బదిలీ చేశారు. అనంతరం ఆయన స్థానంలో రాకేష్‌ను సీసీగా నియమించారు. సీసీగా నియామకమై సుమారు రెండు నెలల నుంచి మూడు నెలలు అవుతున్నా రాకేష్‌పై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. కారుణ్య నియామకాలతో పాటు ఇతర పనుల్లో సైతం ఆరోపణలు వెల్లువెత్తడంతో నూతన కమిషనర్ దిలీప్‌కుమార్ రాకేష్‌పై వేటు వేశారు. ముఖ్యంగా నగర పాలక సంస్థలో సీసీలదే పెత్తనం కావడంతో సీసీల ఆగడాలు ఎక్కువైపోయాయి. అధికారులను వేధించడంతో పాటు ఇతర పనుల్లో కల్పించుకోవడం పైరవీలు చేయడం వీరి పనిగా మారింది. దీంతో సీసీలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నూతన కమిషనర్ వీటిని చెక్ పెట్టేందుకు నూతన సీసీని నియమించుకున్నారు.

## విద్యార్థి యువ గర్జనను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నుడా చైర్మన్

సుభాష్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 2న జరిగే విద్యార్థి యువ గర్జనను విజయవంతం చేయాలని బరికుంట శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నుడాకార్యాలయంలో విద్యార్థి యువగర్జన పోస్టర్లను నుడా చైర్మన్ కేశవేణు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బరికుంట శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి నాయకత్వంలో ఏబీసీడీ వర్గీకరణ సాధిద్దామనే నినాదంతో ఈ సభను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 30 సంవత్సరాల మాదిగల పోరాటానికి ఆగస్టు 1న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుతీర్పు వర్గీకరణకు అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణకు కట్టుబడి ఉంటామని చెప్పడం జరిగిందన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభాగల మాదిగలకు జనాభా దామాషా ప్రకారం 12శాతం రిజర్వేషన్లు కల్పించి ఏబీసీడీ వర్గీకరణ చేసి మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలన్నారు. ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే మాదిగ విద్యార్థి యువగర్జన సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలనికోరారు.ఈకార్యక్రమంలో జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజ్‌గగన్, దేవయ్య, గంగాధర్, సాయి కాంబ్లె, శంకర్, హరీష్, సురేష్, బాయికాడి లత తదితరులు పాల్గొన్నారు.

## ఆలీసాగర్ ఉప కాలువ పరిశీలన




ఉప కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ బలరాం, ఏఈ ప్రణయ్‌రెడ్డి

నవీపేట,జనవరి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫత్తేనగర్ నుంచి రాంపూర్ వరకు ఉన్న అలీసాగర్ డీ50/10/5 ఉప కాలువను బుధవారం ఇరిగేషన్ ఈఈ బలరాం పరిశీలించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో "డీ50/10/5 ఉప కాలువకు అందని సాగునీరు" అనే వార్తకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ బలరాం మాట్లాడుతూ ఫత్తేనగర్ నుంచి రాంపూర్ వరకు ఉన్న ఉపకాలువలో పూడిక పెరిగిపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడంలేదని అన్నారు. ఇరిగేషన్ గ్యాంగ్‌మెన్ల సహాయంతో పాటు ఆయకట్టు రైతులు కలిసి ఉపకాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పూడిక తొలగింపు అనంతరం ఉపకాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని ఈఈ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రణయ్‌రెడ్డి ఉన్నారు.

● జన్నేపల్లి మాటు కాలువపై అక్రమంగా వేసిన కోకాల తొలగింపు

మండలంలోని జన్నేపల్లిలోని మాటు కాలువపై అక్రమంగా వెలిసిన కోకాలను బుధవారం తొలగించడం జరిగిందని ఇరిగేషన్ ఈఈ బలరాం తెలిపారు. ఇటీవల జన్నేపల్లి మాటు కాలువపై అక్రమంగా మూడు కోకాలు వెలిశాయని ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించి సంబంధిత కోకాలను తొలగించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మాటు కాలువపై అక్రమంగా కోకాలను ఏర్పాటు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## డి46 కెనాల్ తూములో రాళ్ల తొలగింపు



డి46 కెనాల్ తూమును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి

ఎడపల్లి, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి మినీలో తేదీ 28న ప్రచురితమైన డి46 కెనాల్ తూములో రాళ్లను తొలగించాలి అనే కథనానికి స్పందన లభించింది. ఈకథనానికి స్పందిస్తూ ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఎడపల్లి మండల ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లు తమ సిబ్బందితో ఎడపల్లి పెద్ద చెరువులోకి నీళ్లు వచ్చే నిజాంసాగర్ డి46 కెనాల్ తూములో ఉన్న బండరాళ్లను తీయించి, తూము చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. నిజాంసాగర్ కెనాల్ తూములలో ఎవరు కూడా బండరాళ్లు పెట్టవద్దని అలా పెట్టినట్లు తెలిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని ఆమె అన్నారు.

## టీజీఎన్‌పీడీసీఎల్ కంపెనీలో జిల్లాకు మూడో స్థానం

● ప్రశంసాపత్రాలను అందజేసిన సీఈ అశోక్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఈ అశోక్

సుభాష్‌నగర్,జనవరి 29(ఆంధ్రజ్యోతి):టీజీఎస్ పీడీసీఎల్ వరంగల్ కంపెనీ పరిధిలో జిల్లాకు మూడవ స్థానం లభించింది. జిల్లా అధికారుల ఉత్తమ సేవలకు గాను టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ కంపెనీ గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నిజామాబాద్ జిల్లాకు మూడో స్థానం ప్రకటించారు. ప్రశంసాపత్రాలను సీఈ అశోక్ జిల్లా ఎస్ఈ రవీందర్‌కు అందజేశారు. అనంతరం సీఈ అశోక్ మాట్లాడుతూ జిల్లా అధికారులు చిత్తశుద్ధితో పనిచేశారని అన్నారు. జిల్లాలోని డీఈలు, ఏడీఈలు ఉత్తమ సేవలు కనబర్చినందుకు అభినందించారు. రానున్న రోజుల్లో జిల్లాను మొదటి స్థానంలో వచ్చేలా పనిచేయాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలానికి ముందస్తు జాగ్రత్తలో భాగంగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో ఆరు పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ రూ.6కోట్లతో ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. నిజామాబాద్ పట్టణంతో పాటు బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో అధిక లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను బిగించడం జరిగిందన్నారు. రూ.5కోట్లతో వీసీబీలు ఏర్పాటు చేయడానికి పనులు జరుగుతున్నాయని అన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంత రాయం జరుగకుండా నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందజే యడానికి సంసిద్ధత చేయడానికి ఈ సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. పనులు జరుగుతున్న వాటిని వేగ వంతం చేసి ఫిబ్రవరిలోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమా వేశంలో జిల్లా ఎస్ఈ రాపెల్లి రవీందర్, ట్రాన్స్‌కో ఎస్ఈ సూర్య నర్సింహారావు, డీఈలు రమేష్, రాజేశ్వర్‌రావు, ఉత్తమ్, ముక్తార్, వెంకటరమణ, పీవీరావు, జిల్లాలోని ఏడీఈలు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యుడి అరెస్టు..పరికరాలు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీరాజ వెంకటరెడ్డి

ఖిల్లా,జనవరి 29 (ఆంధ్రజ్యోతి):మాక్లూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్న పీఎంపీ వైద్యుడు హరికృష్ణచారి అనే వ్యక్తిని మాక్లూర్ పోలీసులు పట్టుకుని ఆయన వద్ద నుంచి వైద్యానికి సంబంధించిన ప్రథమచికిత్స కిట్స్, మందులు స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకటరెడ్డి తెలిపారు. వివరాలను ఆయన చాంబర్‌లో బుధవారం విలేకరులకు వెల్లడించారు.కల్లెడ గ్రామానికి చెందిన ఓయువతీకి మెండోర మండలం సావెల్ గ్రామానికి చెందిన నల్ల వివేక్ అనే యువకుడితో ప్రేమలో పడింది.ఈక్రమంలో ఆమె గర్భవతి అయింది. గర్భం వచ్చిన విషయాన్ని వివేక్‌కు తెలియజేసింది. దీంతో గర్భం తీయించుకోవడానికి ఇద్దరు నిర్ణయించుకుని రెంజర్ల గ్రామానికి చెందిన పీఎంపీ గజ్జల హరికృష్ణను ఆశ్రయించారు. ఈనెల 4న కొన్ని మందులు ఇచ్చాడు. అవి తీసుకున్న యువతీకి ఈనెల 7న కరుపునొప్పితో పాటు రక్తస్రావం జరిగింది. అపస్మారక పరిస్థితిలో ఉన్న ఆ యువతిని కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.అక్కడి వైద్యులు ఆమెకు గర్భస్రావం అయిన విషయాన్ని తెలియడంతో పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వెంటనే ఆమె కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అప్పుడు మాక్లూర్ పోలీసులు అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేసుకున్నారు. కేసునమోదు చేసుకుని విచారణ చేసిన పోలీసులు నకిలీ వైద్యుడి గుట్టును రట్టు చేశారు. యువతి ఆయేషా మృతికి కారకుడైన హరికృష్ణపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెడికల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలపై అర్హత లేని వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుల నేపథ్యంలో డివిజన్ పరిధిలోని ఇందల్వాయికి చెందిన గంగాధర్ అనే వైద్యుడిని, ఆర్మూర్ రోడ్డులో మానస హాస్పిటల్‌ను స్థాపించిన డిచ్‌పల్లికి చెందిన ఆర్.రాజేందర్‌తో పాటు మణికంఠ చికిత్స కేంద్రం, ప్రశాంత్ క్లీనిక్‌ను స్థాపించిన మర్రి వెంకటేశ్వర్, ఎస్.దత్తాత్రిలను, న్యాలకల్ రోడ్డులో చందన ప్రథమ చికిత్స కేంద్రాన్ని స్థాపించిన మల్లేశంపై, మోపాల్‌కు చెందిన ఎం. విఠల్‌సింగ్, సూర మహేష్‌కుమార్‌లపై కేసులు నమోదు చేయడం జరిగినట్లు ఏసీపీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

సుభాష్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల నియోజకవర్గ జిల్లాస్థాయిలో గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు ఇస్తూ నిరసన కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈనెల 31వ తేదీ నాటికి 420 రోజులు అవుతున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త నిరసన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో అన్నివర్గాల ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాల సందర్శన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, జనవరి29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రజాపరిషత్ రాంమందిర్ ఉన్నత పాఠశాల, నవనాథపురం పాఠశాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజు సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ నిర్వాహకులు మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## టీయూలో కాంట్రాక్టు అధ్యాపకుల ఆందోళన

● టీయూలో బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన

డిచ్‌పల్లి,జనవరి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1200మంది కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని బేసిక్, హెచ్ఆర్ఏ, డీఏతో కూడిన మూలవేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు బుధవారం వర్సిటీ కళాశాల నుంచి పరిపాలన భవనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు దేవరాజ్ శ్రీనివాస్, శరత్, కిరణ్ రాథోడ్, సురేశ్, గంగాధర్,జ్యోత్స్నకిరణ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

## దూపల్లి పాఠశాల సందర్శన

రెంజల్,జనవరి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సెంట్రల్ సోషల్ ఆడిట్ టీం సభ్యులు మోహన్ రావు, సుమలతలు సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల బోధన తీరుతో పాటు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం వెంకటలక్ష్మి, పీఆర్టీయూ అధ్యక్షులు సోమలింగం గౌడ్, అమ్మఆదర్శ చైర్మన్ లక్ష్మిప్రియ, ఉపాధ్యాయులు కృష్ణ, ప్రభాకర్, సాయన్న, రాజేశ్వర్, రాములు, రాధ, పోశెట్టి తదితరులున్నారు.

## యూజీసీ నిబంధనలు తక్షణమే వెనక్కి తీసుకోవాలి

డిచ్‌పల్లి,జనవరి 29(ఆంధ్రజ్యోతి):తెలంగాణ వర్సిటీలో బుధవారం వీసీయాదగిరిరావు చేతుల మీదుగా ఎస్ఎఫ్ఐ కరపత్రాలను ఆవిష్కరించారు.ఈసందర్భంగా యూజీసీ సంబంధిత నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు శివ డిమాండ్ చేశారు.వర్సిటీలో కళాశాలలో ఉపాధ్యాయుల నియామకాలు,ప్రమాణాల నిర్వహణపేరుతో మూసాయిదా మార్గదర్శకాలను యూజీసీ విడుదల చేయడం దారు ణమని విద్యార్థి నాయకులు రాజుకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, పృథ్వి, కిరణ్, పవన్, పాల్గొన్నారు.

## 2న ప్రభుత్వ ఈతకొలను ప్రారంభం

సుభాష్‌నగర్,జనవరి 29(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఈతకొలను ఫిబ్రవరి 2న ప్రారంభించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకట నలో తెలిపారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోగల ఈతకొలను ఆదివారం ఉదయం ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు మొదటి బ్యాచ్, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు రెండవ బ్యాచ్, సాయంత్రం 7గంటల నుంచి 8 గంటల వరకు మహిళల బ్యాచ్ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వి ద్యార్థిని విద్యార్థులు, యువకులు, పెద్దలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాల న్నా రు. ఇతర వివరాల కోసం స్విమ్మింగ్ కోచ్ మహిపాల్‌రెడ్డి 9866970010 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా నూర్జహాన్



సుభాష్‌నగర్,జనవరి 29 (ఆంధ్రజ్యోతి):సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యురాలిగా నూర్జహాన్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంగారెడ్డిలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర నాల్గవ మహాసభలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.జిల్లాకు చెందిన నూర్జహాన్‌ను రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నుకున్నారు.ఈసందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ మహాసభల నిర్ణయాలలో భాగంగా జిల్లా లో మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటంతో పాటు సామాజిక ఉద్యమాలను కార్మికవర్గసమ స్యలపై పోరాటాలను సరళీకరణ విధానాల వల్ల ప్రజలపై పడుతున్న బారాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మహాసభల్లో జిల్లా నుంచి హాజరైన ప్రజాప్రతినిధులు జిల్లా సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీకి ఎన్నుకున్న ప్రతినిధులకు, రాష్ట్రనాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

డిచ్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బి) శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని స్వామి వారి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ప్రధాన అర్చకులు రాహుల్, సచిన్ త్రిపాఠిలు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి రావుల బ్రహ్మానందం దంపతులు స్వామి వారికి పుస్తే మట్టెలు తలంబ్రాలు, సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

● రోడ్డు భద్రత అవగాహన సదస్సులో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా న్యాయాధికారి సునీత




రోడ్డు భద్రత మాసోత్సవాల్లో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్,జనవరి29(ఆంధ్రజ్యోతి):ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా వాహనాలు నడిపే వారు కాకుండా ఇతరులు కూడా సురక్షితంగా ఉంటారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని శ్రీరామ గార్డెన్‌లో పోలీసు,రవాణా శాఖ సంయుక్తంగా పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమనిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తమ తల్లిదండ్రులతో పాటు తమ చుట్టుపక్కల ఇళ్ల వారు సైతం హెల్మెట్‌లు ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలతో పాటు రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త పడవచ్చని అన్నారు. కానీ కొందరు చిన్న వయస్సులోనే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్నారని దాని వల్ల కొందరు జీవితాలను కోల్పోతుండగా, మరి కొందరు అవయవాలను కోల్పోతున్నారని అన్నారు. జిల్లాన్యాయాధికారిసునీత కుంచాల మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను, రోడ్డు భద్రత నిబంధనలను పాటిస్తే ఎలాంటి సమ స్యలు ఉండవన్నారు.ఈసందర్భంగా విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్అంకిత్, జిల్లారవాణాశాఖకమీషనర్ దుర్గాప్రమీల,డీసీపీబస్వారెడ్డి,ఏసీపీరాజావెంకటరెడ్డి, డీటీసీఉమామహేశ్వర్‌రావు,వెహికిల్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్,పోలీస్‌సిబ్బంది,కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

● కేంద్ర మంత్రి సంజయ్ క్షమాపణ చెప్పాలి

**సిరికొండ:**తెలంగాణ వైతాళికులను విమర్శించ డాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తప్పుబట్టారు. పద్మశ్రీ అవా ర్డుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన తెలంగాణ వైతాళికులు గద్దర్, అందెశ్రీ, గోరేటి వెంకన్న, తిరుమలరావులను ఎంపిక చేయకపోవడం బాధాకర మన్నారు. పద్మశ్రీ ఇవ్వకపోగా గద్దర్ లాంటి తెలంగాణ పోరాట యోధుడిని విమర్శించడం ఆయన పట్ల హేయభావాన్ని ప్రకటించడం పట్ల కేంద్ర మంత్రి బండిసంజయ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని భూపతిరెడ్డి డిమాండ్ చేశారు.బీజేపీ నేతలు తెలంగాణ వైతాళికుల పట్ల తమ పద్ధతులు మార్చుకోక పోతే ప్రజలేబుద్ధి చెబుతారని అన్నారు.అంత కు ముందు కస్తూర్బా స్కూల్‌లో విద్యార్థుల వద్ద కు వెళ్లి విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రన్న, నర్సారెడ్డి, నర్సింగ్, తదితరులతో పాటు కేజీబీవీప్రత్యేక అధికారిఉపాధ్యాయులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో మౌని అమావాస్య పూజలు

నిజామాబాద్ కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):పుష్య మౌని అమావాస్యను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజలు సాగాయి. ఆలయాల్లో దేవతలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అమావాస్యను పురస్కరించుకొని శని దేవుడికి తైలాభిషేకం నిర్వహించి ఆరాధించారు. పితృదేవతలకు ప్రీతికరమైన అమావాస్య కావడంతో నదీతీర ప్రాంతాల్లో పిండప్రధానాలు, తర్పనాలు నిర్వహించారు. ఆలయాల్లో పెద్ద ఎత్తున అన్నప్రసాదాలు భక్తులకు అందజేశారు. జిల్లా కేంద్రంలోని కిషన్‌గంజ్, దత్త హనుమాన్ ఆలయం, బోయిగల్లి హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు నిర్వహించారు. నదీతీర ప్రాంతాలైన పోచంపాడ్, తుంగిని, కందకుర్తి, గుమ్మిర్యాల్, బినోల తదితర ప్రాంతాల్లో భక్తుల పుణ్యనదీ స్నానాలతో రద్దీగా మారాయి.

**ఒరిజినల్ విక్రయ దస్తావేజు పోయినది**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ యగు శ్రీ యం. ప్రకాశ్ రెడ్డి తండ్రి : యం. లక్ష్మారెడ్డి, వయస్సు 70 సం.లు, వృత్తి: న్యాయవాది మరియు వ్యవసాయం, నివాసం: ఇ.నెం.5-10-52, ఎల్లమ్మగుట్ట, నిజామాబాద్ గారి స్వంత వ్యవసాయ భూమి సర్వే నెం. 202 మరియు 193 మరియు అతని భార్య పేరున గల సర్వే నెం. 207 మరియు అతని కుమారుడి పేరున గల సర్వే నెం. 196, నిజామాబాద్ జిల్లా, ఇందల్వాయి మండలం, ఇందల్వాయి గ్రామ శివారులో గలదాని యొక్క ఒరిజినల్ రిజిస్టార్ సేలడీడ్ డాక్యుమెంట్ నెం. 7370/2004, తేది. 18-08-2004 (యం. ప్రకాష్‌రెడ్డి), 7372/2004, తేది. 18-08-2004 (యం. ప్రకాష్‌రెడ్డి), 7371/2004, తేది. 18-08-2004 (యం. ప్రియతంరెడ్డి), 7374/2004, తేది. 18-08-2004 (యం. శైలజా), జాయింట్ సబ్ రిజిస్ట్రార్, నిజామాబాద్ నందు రిజిస్ట్రేషన్ చేయబడిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ నిజామాబాద్ 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినవి. దీనికి సంబంధించి నా క్లయింట్ మీ-సేవా అప్లికేషన్ నెం. 152000901251147428376, తేది. 09-01-2025 ద్వారా 4వ టౌన్ పోలీస్ స్టేషన్‌కు పిర్యాదు చేయడం జరిగింది. పైన పేర్కొనబడిన దస్తావేజులు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింద పేర్కొనబడిన చిరునామాకు అందజేయగలరు.

సం/- జి.వి. కృపాకర్ రెడ్డి , అడ్వకేట్, ఇ.నెం.5-9-64, శ్రీనిలయం, ఎల్లమ్మగుట్ట, నిజామాబాద్. సెల్ : 9849333644

తేది: 29-01-2025, స్థలం: నిజామాబాద్




**చికెన్ ధరలు**

| రకం | : లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | : రూ.180 | రూ.250 | రూ. 270 |
| వెన్‌కాబ్(కిలో) | : రూ.190 | రూ.260 | రూ. 280 |

**బంగారం ధరలు**

| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.82500 | రూ.76200 | రూ.950 |

**సినిమా గైడ్ నిజామాబాద్**

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్
స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : స్కై ఫోర్స్ (హిందీ) (10.50, 1.35, 7.25, 10.10)
: డాకు మహారాజ్ (4.20)
స్క్రీన్-3 : తల్లి మనస్సు (11.05)
: గాంధీతాత చెట్టు (2.10, 8.00)
: గేమ్ చేంజర్ (4.40)
: హత్య (10.30)
స్క్రీన్-4 : డియర్ కృష్ణ (11.00)
: ఐడెంటిటీ (1.45)
: హాంకాంగ్ వారియర్స్ (5.00)
: డాకు మహారాజ్ (7.20)
: పుష్ప-2 (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1 : ఐడెంటిటి (1.30)
: డాకు మహారాజ్ (4.30, 10.20)
: గేమ్ చేంజర్ (7.20)
స్క్రీన్-2 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.30, 4.30, 7.20, 10.00)
స్క్రీన్-3 : స్కై ఫోర్స్ (హిందీ) (11.00, 1.50, 4.50, 7.30, 10.30)

దేవి : డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: స్కైఫోర్స్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: గేమ్ చేంజర్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్